జోగుళాంబను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

ఆలయంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, భీమిలీ ఎమ్మెల్యే ఘంటా శ్రీనివాస్

అలంపూర్, జూన్ 9 : పట్టణంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నటుడు అశోక్‌కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు యేశారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. వారివెంట స్థానిక ఎమ్మెల్యే విజయుడు బీఆర్ఎస్ నాయకలు రుక్కు, నాగేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 'ప్రజావాణి' నిర్వహణ

- జోగుళాంబ కలెక్టర్ సంతోష్

గద్వాల, జూన్ 9 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జి ల్లాలో పార్లమెంట్ కోడ్ అమలులో ఉన్నందున కొన్ని వారాలుగా ప్రజావాణి కార్యక్ర మం తాత్కాలికంగా రద్దు చేశామని, తిరిగి యథావిధిగా సోమవారం నుంచి ఉదయం 10:30గంటలకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు కార్యక్రమంలో పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి లో వివిధ శాఖల జిల్లా అధికారులు సకాలంలో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పోరాట స్ఫూర్తిదాత బిర్సాముండా

బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు

వనపర్తి టౌన్, జూన్ 9 : పోరాట స్ఫూర్తిదాత బిర్సాముండా అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బిర్సాముండా వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసుల తొలి పోరాట స్ఫూర్తి ప్రదాత బిర్సా ముండా అని, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో ఆదివాసీలకు నాయకత్వం వహించి బ్రిటీషు వారిని తరిమికొట్టాడన్నారు. ఆదివాసీల హక్కుల కోసం , స్వయంపాలన కోసం ఉద్యమించిన మహనీయుడని ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు గంధం నాగరాజు, కవి పండితుడు గిరిరాజాచారి పాల్గొన్నారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి కల్పించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూన్ 9 : దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా అమెరికా తెలుగు అసోసియేషన్ ఉత్సవంలో ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రోడ్డు భవనాల శాఖ మంత్రి, సినిమా ఆటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ఎన్ఆర్ఐలను కోరారు. దేవరకద్ర నియోజకవర్గం ఎయిర్‌పోర్ట్‌కు భూత్పూర్ నుంచి కొత్తకోట మండలం వరకు పెద్దఎత్తున జాతీయ రహదారి ఉందని ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పి పాలమూరు యువతకు ఉపాధి అందించాలని కోరారు. ఈ సందర్భంగా వారు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఇంట్లో భారీ చోరీ

బంగారు ఆభరణాలు, వెండి, రూ.లక్ష నగదు అపహరణ

బీరువా తెరుచుకొని ఉన్న దృశ్యం

గట్టు, జూన్ 9 : కుటుంబసభ్యులు దైవ దర్శనానికి వెళ్లగా ఇదే అదనుగా భావించి ఇంట్లోకి చొరబడి భారీ చోరీ చేసిన ఘటన మండలంలోని ఆలూరులో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నర్సన్‌గౌడ్ తన కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి శుక్రవారం ఉదయం మన్యంకొండకు బయలుదేరారు. అక్కడ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని శనివారం సాయంత్రం ఆలూరుకు చేరుకున్నారు. నర్సన్‌గౌడ్ కుటుంబసభ్యులు ఇంటి తలుపులు తెరిచి చుడగా బెడ్‌రూంకు వేసిన తాళం పగులగొట్టడాన్ని గమనించారు. బీరువా తెరిచి ఉండడాన్ని గ్రహించారు. బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు వారు గుర్తించారు. బాధితుడు నర్సన్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని, కేసును త్వరగా ఛేదిస్తామని ఎస్సై రామకృష్ణ స్పష్టం చేశారు.

కుక్కల దాడిలో తొమ్మిది మేకలు మృతి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ వైస్ చైర్మన్

వనపర్తి టౌన్, జూన్ 9 : కుక్కల దాడిలో తొమ్మిది మేకలు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన బర్ల బుచ్చమ్మ గేదెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో బర్రెలు, షెడ్డులోకి వీధి కుక్కలు ప్రవేశించి 9 మేకలపై దాడిచేసి చంపివేశాయి. రోజువారి దినచర్యలో భాగంగా గేదెలకు పాలు పితకడానికి వచ్చిన కుటుంబ సభ్యులు మేకలు మృతిచెంది చెల్లచెదురుగా పడి ఉండడం చూసి బోరున విలపించారు. బర్రెలు, మేకలపై ఆధారపడి జీవిస్తున్న తమకు ఇప్పుడు ఆధారం లేకుండా పోయిందని విలపించారు. ప్రభుత్వం అండగా నిలిచి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కుక్కల నుంచి చిన్నారులు, మూగ జీవాలను కాపాడేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతిచెందిన ఘటన తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు రవిప్రసాద్, కాంగ్రెస్ నాయకులు గంధం లక్ష్మయ్య, దినేశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

సమాజ మార్పునకు పోరాటం సీపీఎంకే సాధ్యం

అయిజ, జూన్ 9 : విశ్వమానవాళి శ్రేయస్సు, అంతర్జాతీయ దృక్పతాన్ని కలిగి సమాజ మార్పు కోసం పోరాటం సీపీఎం పార్టీకే సాధ్యమని పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు చేసే పోరాటాలకు భారతదేశం బాసటగా నిలువాలని రాసుకున్నామన్నారు. సమావేశంలో ఈశ్వర్, నర్సింహ, రాజు, పరంజ్యోతి, విజయ్‌కుమార్, పెద్దరాముడు, సవారన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

- 4200 మంది విద్యార్థులు హాజరు
- 1034 మంది గైర్హాజరు
- జోగుళాంబ కలెక్టర్ సంతోష్

గద్వాలలో గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్‌తో కలిసి తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, జూన్ 9 : జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించినట్లు కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల కేంద్రాల్లో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణను అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ ప్రశ్నాపత్రాల బుక్‌లెట్స్, వోఎంఆర్‌షీట్లను ని బంధనల ప్రకారం జాగ్రత్తగా సీల్ చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. పరీక్ష ప్రారంభానికే ముందే బయోమెట్రిక్ హాజరు పక్కాగా తీసుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు ఎవరూ హాల్ లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లకుండా పక్కాగా తనిఖీ చేసినట్లు అధికారులు కలెక్టర్ వివరించారు. మిగిలిపోయిన వోఎంఆర్ షీట్స్, జవాబు పత్రాలను నిబంధనల ప్రకార నిర్దేశించిన బాక్స్‌లో సీల్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రూట్ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల్లో టీజీ పీఎస్సీకి పంపనున్నట్లు పరీక్షల జిల్లా సమన్వయకర్త రామ్మోహన్ తెలిపారు. మొత్తం 5,234మంది దరఖాస్తు చేసుకోగా 4,200మంది అభ్యర్థులు హాజరయ్యారని, 1034 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతిపరీక్షా కేంద్రంలో డీవోలతో అబ్జర్వర్లు విధులు నిర్వహించారన్నారు. నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ముగ్గురు రూట్ అధికారులు 51మంది ఇతర అధికారులు పరీక్షలు సజావుగా జరిగేందుకు బాధ్యతలు నిర్వర్తించినట్లు కలెక్టర్ తెలిపా రు. మొత్తం మీద అధికారుల సహకారంతో జిల్లాలో గ్రూప్-1ప్రిలిమినరీ ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ తెలిపారు.

వనపర్తి జిల్లాలో..

వనపర్తి టౌన్, జూన్ 9 : జిల్లావ్యాప్తంగా గ్రూపు -1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా కొనసాగిందని రీజినల్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 17 పరీక్షా కేంద్రాలకు గానూ జిల్లా కేంద్రంలో 15 కేంద్రాలు, కొత్తకోటలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. 4,843మంది అభ్యర్థులకు గానూ 4,007 మంది హాజరు కాగా 836మంది గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు పకడ్బందీగా బందోబస్త్ నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 9నుంచి 10గంటల వరకు అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి హాల్‌లోకి అనుమతించారన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సమయం కన్నా ముందే చేరుకొని హాల్ టికెట్ నెంబర్లను సరి చూసుకొని కేంద్రంలోకి వెళ్లారు. కొంతమంది అభ్యర్థులు సమయం అయిపోతుందేమోనని కేంద్రాల వరకు పరుగులు తీశారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆయన చెప్పారు.

ఎర్రవల్లిలో..

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 9 : ఎర్రవల్లి చౌరస్తా మండల కేంద్రంలో ఆదివారం రోజు ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్ష అవాంచనీయ ఘటనలు లేకుండా జరిగింది. ఈ సందర్భంగా సాయుధచైతన్య పాఠశాల, సరస్వతి పాఠశాల పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయుధ చైతన్య పాఠశాలో 432 మంది విద్యార్థులకు 333 మంది హాజరవ్వగా, 99 మంది గైర్హాజరయ్యారు. సరస్వతి పాఠశాలలో 288 విద్యార్థులకు 233 మంది వి ద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు, 55మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఎంపీడీవో అజర్‌మొహినుద్దీన్, అబ్జర్వర్ లింగస్వామి, సీఐ రవి బాబు, హెచ్ఎం పాషావలి, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, శ్రీను పరీక్ష సరళిని పరిశీలించారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

వనపర్తి టౌన్, జూన్ 9 : రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన గ్రూపు- 1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. జిల్లావ్యాప్తంగా 17 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా బాలికల ఉన్నత పాఠశాల, గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. కేంద్రాలను పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు.

కొత్తకోట మండలంలో..

కొత్తకోట, జూన్ 9 : కొత్తకోటలోని నివేదిక జూనియర్ డిగ్రీ కళాశాలలో గ్రూప్-1 పరీక్ష ఏర్పాటు చేయగా ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జూనియర్ కళాశాలలో 336మందికి గానూ 83మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డిగ్రీ కళాశాలలో 360మందికి గానూ 58మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. 10గంటల సమయం తర్వాత అభ్యర్థులను అనుమతించలేదు. పది గంటల సమయం దాటాక వచ్చిన అభ్యర్థులను వెనక్కితిరిగి పంపించారు. పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ విధించి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తును సీఐ రాం బాబు, ఎస్సై మంజునాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.

గట్టి బందోబస్తు

గద్వాల అర్బన్, జూన్ 9 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష సజావుగా సాగేందుకు అభ్యర్థులు సహకరించారని, పరీక్షా కేంద్రాల వద్ద ముందస్తుగా జాగ్రత్తలు తీసుకొని పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు నోడల్, పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేశారని గుర్తు చేశారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ రక్షితా మూర్తి

వనపర్తిలో చంటి పిల్లతో పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థిని

వనపర్తిలో అభ్యర్థులను పరిశీలిస్తున్న సిబ్బంది

వనపర్తిలో సమయం దాటడంతో పరుగులు పెడుతున్న అభ్యర్థి

పదోపటాలంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రభుత్వపాఠశాలలో మెరుగైన విద్య

పాన్‌గల్, జూన్ 9: ప్రభుత్వ పాఠశాల ల్లో మెరుగైన విద్య అందుతుందని హెచ్ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, భద్రూనాయక్ అన్నారు. మండల కేంద్రంతోపాటు బండపల్లి, దవాజీపల్లిల్లో ఆదివారం వారు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం

ఇటిక్యాల, జూన్ 9 : బీచుపల్లి క్షేత్రం కోదండరామాలయంలో ఆదివారం పునర్వసు నక్షత్రమున స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు దత్తుస్వామి వేదమంత్రోచ్ఛాలతో కల్యాణం పూర్తి చేశారు. కనుల పండువగా నిర్వహించిన ఈ వేడుకలలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి

- ప్రసవ అనంతరం ఫిట్స్ రావడంతో కర్నూల్‌కు రెఫర్
- చికిత్స పొందుతూ మృతి
- జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖాన ఎదుట బాధితుల ఆందోళన
- రూ.8 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం

ప్రైవేట్ దవాఖాన వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

గద్వాల అర్బన్, జూన్ 9 : వైద్యుల నిర్లక్ష్యంతో ఓ బాలింత మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గద్వాల మండలంలోని కుర్వపల్లి గ్రామానికి చెందిన శివలీల(21)కు పురిటి నొప్పులు రావడంతో ఈనెల 5వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానలో చేరింది. వైద్యులు శివలీలను పరీక్షించి సాధారణ కాన్పు కాకుండా సిజేరియన్ చేశారు. ఆపరేషన్ అనంతరం శివలీలకు ఫిట్స్ రావడంతో వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌లోని ప్రైవేట్ దవాఖానకు రెఫర్ చేశారు. అయితే అక్కడ శివలీల చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్య కారణంగానే బాలింత మృతి చెందిందని శివలీల కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ అదివారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అయితే దవాఖాన యాజమాన్యం మృతి చెందిన శివలీల ప్రాణంకు వేల కట్టారు. రూ.8 లక్షలతో బాధిత కుటంబ సభ్యులకు అందజేసి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డట్లు తెలిసింది.

ఈ విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధప్పను వివరణ కోరగా...ఈ విషయం తన దృష్టికి రాలేదని ఘటనకు సంబంధించి పూర్తి విషయాలు ఆరా తీసి బాధ్యులపైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రైవేట్ దవాఖాన డాక్టర్‌ను వివరణ కొరేందుకు ప్రయత్నం చేయగా...అందుబాటులోకి రాలేదు.

11న డిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక..

గద్వాల, జూన్ 9 :బెస్ట్ అవెలబుల్ పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను ఈనెల 11వ తేదీ ఉదయం 10:30గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో డిప్ ద్వారా ఎంపిక చేయనున్నారు. 2024-2025 విద్యాసంవత్సరానికి గానూ 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ 57 సీట్లు, ఐదో తరగతి రెసిడెన్షియల్ 59సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ తప్పక హాజరు కావాలని కలెక్టర్ పాటు జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వేతాప్రియదర్శిని తెలిపారు.

సగర సంఘం పట్టణ అధ్యక్షుడిగా చీర్ల గోవర్ధన్‌సాగర్ ఎన్నిక

వనపర్తి టౌన్, జూన్ 9 : సగర సంఘం పట్టణ నూతన అధ్యక్షుడిగా చీర్ల గోవర్ధన్‌సాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సగర సంఘ సమావేశానికి రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు శేఖర్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరై గోవర్ధన్‌సాగర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సంఘ సమావేశంలో పలు అంశాలను రాష్ట్ర, జిల్లా నాయకులు చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర సంఘం యువజన అధ్యక్షుడు సురేశ్‌సాగర్, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు తిరుపతయ్య సాగర్, ఆర్‌బీ ఆంజనేయులు, బాలస్వామి, సురేందర్, దేవేంద్రం, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న మురుగు

- చినుకుపడితే చిత్తడే
- స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తామంటున్న అధికారులు
- వ్యాధులు ప్రబలే అవకాశం

రోడ్డుపైకి వచ్చి చేరిన వర్షపు మురుగు నీరు

మురుగు నీటిని పరిశీలిస్తున్న అధికారులు

అలంపూర్, జూన్ 9 : అలంపూర్ క్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై అలంపూర్ చౌరస్తాలో రోజురోజుకు మురుగు పెరుగుతున్నది. అలంపూర్ చౌరస్తా నాలుగులేన్ల కూడలి నుంచి ఉండవల్లి, అలంపూర్, మానవపాడు తదితర మండలాల్లో ఆయా గ్రామాల ప్రజలు వేల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. అయితే నాలుగు రోడ్లలో ఏ రోడ్డు ప్రక్కన కూడ సరైన వసతులు లేవు. చిన్నపాటి వర్షం కురిసిననా వర్షపు నీరు రోడ్లపై పారుతున్నాయి. ఓ మోస్తరు వర్షం కురిసిందంటే వర్షం నీరు నిలవడంతో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లలోకి గాని, దుకాణాల్లో వెళ్లడానికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఉంది. రోడ్డుపై మురుగునీటిలో వాహనాలు వెళ్తున్నప్పుడు రోడ్డు పక్కన నిలబడ్డ వారిపై పడుతున్నాయి. అలంపూర్ చౌరస్తా పుల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుంది. ప్రస్తుత ఎమ్మెల్యే విజయుడి సొంత గ్రామ పంచాయతీలో సమస్యలు పరిస్కరించుకోలేకపోతే ఎలా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పుల్లూరు పంచాయతీలో అలంపూర్ చౌరస్తా కూడలిలో ఉండే వ్యాపార సముదాయల నుంచి పంచాయతీకి పన్నురూపంలో అధికఆదాయం సమకూరుతుంది. సమస్యల పరిష్కారం కోసం అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పన్నుల వసూళ్లలో చూపెడుతున్న ఆసక్తి, సమస్యలు పరిష్కరించడంలో చూపెట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయ. అంతే కాకుండా చిరు వ్యాపారులు ఫ్లైఓవర్ వంతెనకింద ప్రయాణికులు అధిక మొత్తంలో నిలిచి ఉండే పరిసరాల్లో వారి వ్యాపార అవసరాలు తీర్చుకోవడం కోసం రోడ్డుపైకి జరుగుతున్నారు. కొంతమంది పక్కా నిర్మాణాలు చేసుకున్నారు. నిత్యం జిల్లాస్థాయి అధికారులు చూసిన చూడనట్టు పట్టించుకోవడం లేదనే వాదనలు లేకపోలేదు. దీంతో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీ కార్మికులు సేకరించిన చెత్త వేసేందుకు ప్రత్యేకించి డంపింగ్‌యార్డు కూడా గుర్తించలేదు. నాలు రోడ్ల పొడవున ఎక్కడపడితే అక్కడ చెత్తవేయడం వల్ల బలమైన గాలులు వీచినపుడు చెత్త చెదారం తిరిగి రోడ్లపై చేరుతున్నాయి. నేషనల్‌హైవే వారు గతంలో నిర్మించిన డ్రైనేజి వ్య వస్థ నిర్విర్యంగా మారిపోయింది. కావున సంబంధిత అధికారులు చొరవ చూపి మురుగు డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

ప్రజలు సహకరించాలి

అలంపూరు చౌరస్తా కూడలిలో స్పేషల్ డ్రైవ్ నిర్వహించి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తాం.రోడ్డు ప్రక్కల ఉన్న వ్యాపారులకు నోటీసులు జారి చేయమని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించాం.స్వంత స్థలాలు కాదని రోడ్డు పైకి జరిగి నిర్మాణాలు చేసిన వాటిని కూడ ఒక్కోక్కటిగా తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నాం.జోగుళాంబ ఆర్చీ గేటు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న ట్టు తెలిసింది. స్థానికంగా ఉండే వ్యాపారులు కూడ సహకరించా లి. అపుడు ఏదైన సమస్యకు సం పూర్ణ సరష్కారం దొరుకుతుంది.

- జబ్బార్, ఉండవల్లి ఎంపీడీవో